8- 4- 26 rakshana_praja jyothi Medhak.qxd 4/8/2026 4:57 AM Page 1


మన రాజధాని
# రక్షణ
నిజం మా బలం
బాపట్ల | గుంటూరు | పల్నాడు
బుధవారం 8 ఏప్రిల్ 2026 పేజీలు : 4

## కేంద్ర మంత్రులకు ఆహ్వానం

పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ తరగతులు
కేతనకొండలో శిక్షణ ప్రారంభం

కేతనకొండలో నిర్వహించే ఉచిత సివిల్ సర్వీసెస్ శిక్షణ కార్యక్రమానికి కేంద్ర మంత్రులను ప్రతినిధి బృందం ఢిల్లీలో కలిసి ఆహ్వానించింది.

విజయవాడ రక్షణ న్యూస్



వివరాలు 2లో..

## నాణ్యత తగ్గనివ్వద్దు.

◆సూర్యలంక అభివృద్ధి పనులపై ఎంపీ పరిశీలన
◆సూర్యలంక తీరంలో రూ.97.52 కోట్ల అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష
◆కప్పలవారిపాలెంలో నగరాజు కలువపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనుల తనిఖీ

బాపట్ల పార్లమెంట్ సభ్యుడు, లోక్‌సభ ప్యానెల్ స్పీకర్ తెన్నేటి కృష్ణ ప్రసాద్ మంగళవారం సూర్యలంక తీర ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం బాపట్ల మండలం కప్పలవారిపాలెం గ్రామంలో నగరాజు కలువపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనుల పురోగతిని కూడా అధికారులతో కలిసి సమీక్షించి, పనులు నాణ్యతగా పూర్తి చేయాలని సూచించారు.

బాపట్ల రక్షణ న్యూస్



వివరాలు 2లో..



## క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

### బెట్టింగులపై పోలీసులు హెచ్చరిక...

పల్నాడు జిల్లా నరసరావుపేటలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఐలా బజార్ ప్రాంతంలో గుట్టుగా బెట్టింగ్ జరుగుతోందన్న సమాచారం మేరకు దాడులు చేసి ఆరుగురిని అరెస్ట్ చేసి నగదు, పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.


మిగతా 2 లో

**నరసరావుపేట:**

పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలోని ఐలా బజార్ ప్రాంతంలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. బెట్టింగ్ జరుగుతోందన్న సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు.
అరెస్టైన వారిలో షేక్ ఖాసీం, షేక్ మస్తాన్ వలీ, షేక్ రఫీ జాన్, పసుపులేటి నాగరాజు,

## ముఖ్యమంత్రి పర్యటన కి సన్నాహాలు

నారా చంద్రబాబు నాయుడు పర్యటనకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
సభ ప్రాంగణ ఏర్పాట్ల పై సమగ్ర పరిశీలన



**భట్టిప్రోలు రక్షణ న్యూస్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 9వ తేదీ గురువారం బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలోని భట్టిప్రోలు మండలం సురేపల్లి గ్రామానికి విచ్చేయనున్నారు. ఈ సందర్భంగా పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఈ నేపథ్యంలో జిల్లా పోలీసు అధికారి బి. ఉమామహేశ్వర్ ఆధ్వర్యంలో మంగళవారం ముందస్తు భద్రతా సమన్వయ సమావేశం నిర్వహించి ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి

మిగతా 2 లో

8- 4- 26 rakshana_praja jyothi Medhak.qxd 4/8/2026 4:57 AM Page 2



# క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

మొదటి పేజీ తరువాయి

శిఖా చక్రవర్తి, పతేలా వెంకటేశ్వరరావు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.నిందితుల వద్ద నుంచి నాలుగు లక్షల యాభై ఎనిమిది వేల రూపాయల నగదు, ఒక ల్యాప్‌టాప్, పలు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.క్రికెట్ బెట్టింగ్ ముఠాను చాకచక్యంగా పట్టుకున్న పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించి బహుమతులు అందజేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# కేంద్ర మంత్రులకు ఆహ్వానం

మొదటి పేజీ తరువాయి

విజయవాడ రక్షణ న్యూస్

రాష్ట్ర వెటర్నరీ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ పారా వెంకట లక్ష్మయ్య, స్వచ్ఛ ఆంధ్ర మిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ సి.ఎల్. వెంకటరావు, విద్యా భారతి సౌత్ సెంట్రల్ జోన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ లింగం సుధాకర్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఢిల్లీలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.విజయవాడ సమీపంలోని కేతనకొండలో 200 మంది యువతకు మూడు సంవత్సరాలపాటు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ శిక్షణలో కోచింగ్‌తో పాటు నివాసం, భోజనం సదుపాయాలు కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు.అలాగే కేతనకొండలో నిర్వహించే శిక్షణ తరగతుల ప్రారంభోత్సవానికి కేంద్ర మంత్రులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమం మే 10న నిర్వహించనున్నట్లు తెలిపారు. పేద మరియు ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉచితంగా శిక్షణ అందించడం అభినందనీయమని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు.

# ముఖ్యమంత్రి పర్యటనకి సన్నాహాలు

మొదటి పేజీ తరువాయి

ప్రయాణించే మార్గం, హెలికాప్టర్ దిగే ప్రదేశం, సభా స్థలం, వాహనాల నిలుపుదల ప్రదేశాలు, ప్రజలు చేరే మార్గాలు తదితర అంశాలను సవివరంగా పరిశీలించారు.హెలికాప్టర్ దిగే ప్రదేశంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సభా ప్రాంగణంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి వాహన దళం సాఫీగా ప్రయాణించేలా మార్గాలను పరిశీలించి, ఎక్కడా రాకపోకలకు అంతరాయం కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజలు, పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశమున్నందున వాహనాల నిలుపుదల ప్రదేశాలను విస్తృతంగా ఏర్పాటు చేయాలని, రాకపోకలు సజావుగా సాగేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎలాంటి అప్రమత్తత లోపం చోటుచేసుకోకుండా ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో రేపల్లె ఉప పోలీసు అధికారి ఏ. శ్రీనివాసరావు, ప్రత్యేక శాఖ అధికారి జి. నారాయణతో పాటు పోలీసు శాఖ మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నాణ్యత తగ్గనివ్వద్దు.

మొదటి పేజీ తరువాయి

బాపట్ల రక్షణ న్యూస్

బాపట్ల పార్లమెంట్ సభ్యుడు, లోక్‌సభ ప్యానెల్ స్పీకర్ తెన్నేటి కృష్ణ ప్రసాద్ మంగళవారం సూర్యలంక తీర ప్రాంతంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గత మార్చి నెలలో పనులను పరిశీలించిన ఆయన, మళ్లీ సందర్శించి పనుల పురోగతిని తెలుసుకున్నారు.సూర్యలంక తీరాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు సుమారు రూ.97.52 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా అనే అంశాన్ని ఎంపీ స్వయంగా తనిఖీ చేశారు. పనుల్లో ఎలాంటి రాజీ పడకుండా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యాటకులకు అవసరమైన అన్ని వసతులు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం బాపట్ల మండలం కప్పలవారిపాలెం గ్రామంలో ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద నగరాజు కలువపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణ పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించి, పనుల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పటాన్ రాజేష్, భోగిరి రామారావు, నర్రా ఏడుకొండలు, గవిని దుర్గప్రసాద్, బడుగు పృథ్వీరాజ్, రాజా తదితరులు పాల్గొన్నారు.

# మీడియా సంస్థలపై దాడి అప్రజాస్వామికం

చీరాల రక్షణ న్యూస్



మీడియా సంస్థలపై దాడి చేయడం అప్రజాస్వామిక చర్య అని శ్రీకాళహస్తి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యురాలు కొమ్మనబో యిన రజిని ఖండించారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై వైసీపీ నాయకులు దాడి చేయడానికి ప్రయత్నించడం పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగించే చర్య అని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.వైసీపీ నాయకులు కార్యాలయం వద్దకు వెళ్లి గేట్లు తెరిచి లోపలికి ప్రవేశించే ప్రయత్నం చేయడం, వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసుల విధులకు ఆటంకం కలిగించడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీకి ఉందని తెలిపారు.ఇలాంటి దాడుల సంస్కృతిని వైసీపీ నాయకులు ఇప్పటికైనా విడనాడాలని రజిని సూచించారు. వైసీపీ నాయకురాలు =. ఖ. =శ్యామ ఆర్కే రోజా మీడియాతో మాట్లాడుతూ తమకు సంస్కారం ఉందని చెప్పడం సరైంది కాదని విమర్శించారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు వైసీపీ వ్యవహారశైలి బాగా తెలిసిన విషయమని, పరిస్థితులకు అనుగుణంగా మాట్లాడడం మానుకోవాలని ఆమె పేర్కొన్నారు. మీడియా సంస్థలపై దాడులు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని రజిని స్పష్టం చేశారు.

# ఆటోలకు డిజిటల్ నమోదు తప్పనిసరి

మంగళగిరి రక్షణ న్యూస్



మంగళగిరి మండల పరిధిలో నడిచే ఆటోలకు డిజిటల్ నమోదు ప్రక్రియను అమలు చేస్తున్నట్లు మంగళగిరి గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ తెలిపారు. రాజధాని ప్రాంతంలో పెరుగుతున్న రాకపోకలు, ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.మంగళగిరి గ్రామీణ పోలీస్ స్టేషన్ పరిధిలోని 15 గ్రామాల్లో నడిచే ఆటోలకు ప్రత్యేక సంఖ్యలను కేటాయించి, క్యూఆర్ కోడ్ వ్యవస్థ ద్వారా వారి వివరాలను డిజిటల్ రూపంలో నమోదు చేయనున్నట్లు చెప్పారు. ఈ సమాచారం పోలీస్ నియంత్రణ గదితో అనుసంధానం చేయబడుతుందని తెలిపారు.ప్రాంతంలో విశ్వవిద్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు మరియు ప్రభుత్వ కార్యాలయాలు ఎక్కువగా ఉండటంతో ప్రయాణికుల భద్రతతో పాటు ఆటో కార్మికుల సంక్షేమం కోసం ఈ చర్యలు ఉపయోగపడతాయని ఎస్సై తెలిపారు.రేపటి నుంచి ఉదయం పది గంటల నుంచి మంగళగిరి సర్కిల్ కార్యాలయంలో నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. ప్రతి ఆటో డ్రైవర్ తమ ఆధార్ కార్డు మరియు పాస్‌పోర్ట్ సైజు ఫోటోతో హాజరై వివరాలు నమోదు చేసుకోవాలని ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ కోరారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబాటు



**సత్తెనపల్లి రక్షణ న్యూస్**

సత్తెనపల్లి నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక కార్యక్రమం స్థానిక కార్యాలయంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు గృహాలు, పెన్షన్లు, వైద్య సేవలు, ఇతర సంక్షేమ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఒక్కరి సమస్యను ఓపికగా విన్న కన్నా లక్ష్మీనారాయణ, వాటి తక్షణ పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వంలా కాకుండా ప్రస్తుత ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు నేరుగా తమ సమస్యలను తెలియజేసుకునే అవకాశం లభించడంతో స్థానికులు సంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్న ఈ వేదిక ప్రజా సమస్యల పరిష్కారంలో కీలకంగా నిలిచింది.

# నేతన్నలకు ఉచిత విద్యుత్



**బాపట్ల రక్షణ న్యూస్**

బాపట్ల జిల్లాలో చేనేత కార్మికుల జీవనోపాధికి ఊతమిచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం మగ్గాలకు ఉచిత విద్యుత్ సరఫరా పథకాన్ని అమలు చేస్తోంది. ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చిన ఈ నిర్ణయం వల్ల నేతన్నల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. మగ్గాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వేలాది చేనేత కుటుంబాలు ఇప్పటి వరకు విద్యుత్ బిల్లుల భారం కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, తాజా నిర్ణయంతో ఆ భారాన్ని ప్రభుత్వం భరిస్తోంది. నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడంతో ఒక్కో కుటుంబానికి సంవత్సరానికి సుమారు రూ. 8,640 వరకు ఉపశమనం లభించనుంది. బాపట్ల జిల్లాలో 5,787 మంది చేనేతలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనుండగా, చీరాల, పర్చూరు, వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లోని వేలాది మగ్గాలు దీనివల్ల ప్రయోజనం పొందనున్నాయి. అలాగే మరమగ్గాలకు నెలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడంతో వారికీ ఆర్థిక భారం గణనీయంగా తగ్గనుంది. వస్త్రాల తయారీ ఖర్చులు పెరగడం, మార్కెట్‌లో పోటీ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న చేనేతలకు ఈ పథకం ఊరటనిస్తోంది. విద్యుత్ బిల్లులభారముండకపోవడంతో వృత్తిలో నిలదొక్కుకునే అవకాశాలు మెరుగుపడుతున్నాయి. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చేనేత రంగానికి కొత్త ఊపిరి నింపుతుందని అధికారులు పేర్కొంటుండగా, నేతన్నలు కూడా ఈ పథకంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# మాచర్లలో రథోత్సవం వైభవం



**మాచర్ల రక్షణ న్యూస్**

పల్నాడు జిల్లా మాచర్లలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామివారి రథోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ రథోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. పుష్పాలతో అలంకరించిన రథంపై స్వామివారు ఊరేగింపుగా బయలుదేరగా, భక్తులు గోవింద నామస్మరణతో పాల్గొన్నారు. ఆలయ పరిసరాలు భక్తి పారవశ్యంతో మార్మోగాయి. సుమారు 1880 సంవత్సరం నుంచి ఈ రథోత్సవానికి చారిత్రక ప్రాధాన్యం ఉందని ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమం సందర్భంగా పోలీసులు భద్రతా, ట్రాఫిక్ ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించారు.

# ప్రజా వినతి వేదిక

**భట్టిప్రోలు రక్షణ న్యూస్**



భట్టిప్రోలు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. జిల్లా జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలను వివరించారు. మొత్తం 75 అర్జీలు స్వీకరించగా, వాటిని సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నెలలోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ప్రజల వద్దకు పరిపాలనను తీసుకువెళ్లడమే ముఖ్య ఉద్దేశమని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సేవలకు సంబంధించి గ్రామ సచివాలయాల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

8- 4- 26 rakshana_praja jyothi Medhak.qxd 4/8/2026 4:57 AM Page 4



## తండ్రే హంతకుడు



మాచర్ల రక్షణ న్యూస్

పల్నాడు జిల్లా మాచర్ల పట్టణంలో సంచలనం సృష్టించిన కామనబోయిన చౌడమ్మ అనుమానాస్పద మృతి కేసు హత్యగా మారింది. మొదట ఆత్మహత్యగా నమోదు చేసిన ఈ కేసును పోస్టుమార్టం నివేదిక ఆధారంగా పోలీసులు హత్య కేసుగా మార్పు చేశారు.మార్చి 18న నమోదు చేసిన కేసును ఏప్రిల్ 5న హత్యగా మార్చినట్లు పోలీసులు తెలిపారు. జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టగా సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. మృతురాలి తండ్రి కామన బోయిన చంద్రశ్రీను, అతని మేనల్లుడు పచ్చిపాల శ్రీను కలిసి చౌడమ్మను హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు.ప్రేమ వివాహమే ఈ హత్యకు కారణమని దర్యాప్తులో తేలింది. కుటుంబ సభ్యులను ఎదిరించి వివాహం చేసుకున్న చౌడమ్మను పంచాయతీ పేరుతో ఇంటికి పిలిపించి గొంతు నులిమి హత్య చేసి, అనంతరం ఉరివేసుకుని ఆత్మహత్యగా చూపించే ప్రయత్నం చేసినట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటన మాచర్లలో తీవ్ర కలకలం రేపింది. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా, జడ్జి ప్రశాంత్ 14 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం వారిని గురజాల సబ్ జైలుకు తరలించారు.

## నీటి సమస్యలపై దృష్టి

గుంటూరు రక్షణ న్యూస్



గుంటూరు నగరంలో వేసవి కాలంలో త్రాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. రూ.2.7 కోట్ల అంచనాలతో సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి, నగరంలోని ప్రతి ప్రాంతానికి సమృద్ధిగా నీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.నగరవ్యాప్తంగా 206 ప్రాంతాల్లో డ్రైనేజీ కాలువల మీదుగా వెళ్లే పైపులైన్లను గుర్తించి, కలుషిత నీటి ముప్పు నివారణకు తక్షణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నీటి నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ప్రతిరోజూ శ్యాంపిల్స్ సేకరించి క్లోరిన్ మోతాదును పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.కొత్త పైపులైన్ల ఏర్పాటుకు రూ.1 కోటి, బోర్‌వెల్స్ ఏర్పాటుకు రూ.50 లక్షలు, మరమ్మతులకు రూ.40 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.ప్రజల దాహార్తి తీర్చేందుకు నగరంలోని ప్రధాన కేంద్రాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు, రద్దీ కూడళ్లలో గ్రీన్ మ్యాట్ షెడ్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. త్రాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఫిర్యాదులను 24 గంటల్లో పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు.

# వడగాడ్పుల హెచ్చరిక

పల్నాడు రక్షణ న్యూస్



పల్నాడు జిల్లాలో రానున్న ఐదు రోజుల పాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వేసవి ఎండలు, వడగాడ్పుల నుంచి రక్షణకు అవసరమైన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.వడదెబ్బ నివారణపై జిల్లా, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లకూడదని, అవసరమైతే తల కప్పుకుని వెళ్లాలని సూచించారు.డీహైడ్రేషన్ నివారణకు నీరు, కొబ్బరి నీరు, మజ్జిగ, పండ్ల రసాలు వంటి ద్రవా లను ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. పిల్లలు, గర్భిణీలు, వృద్ధు లు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.వడదెబ్బ లక్షణా లు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం పొందాలని, అవసరమైతే 108 అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించాలని తెలిపారు. జిల్లాలో ఆశా వర్కర్ల వద్ద ఓఆర్ఎస్ అందుబాటులో ఉందని పేర్కొన్నారు.

# డ్రగ్స్ ఫ్రీ దండి మార్చ్ 2.0 సైకిల్ యాత్రకు స్వాగతం పలికిన పోలీసులు

**మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజల సహకారం అత్యవసరం -- డీఎస్పీ శ్రీనివాసరావు**

**యువతే మార్పుకు మార్గదర్శకులు -- సీఐ జయచంద్ర**








**రేణిగుంట ఏప్రిల్ 07**

వైబ్రెంట్స్ ఆఫ్ కలాం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన ప్రపంచంలోనే అతి పెద్ద మాదక ద్రవ్యాల నిర్మూలన ఉద్యమం దండి మార్చ్ 2.0 సైకిల్ యాత్ర రేణిగుంట మీదుగా కొనసాగింది. ఉమ్మడి 13 జిల్లాలు, 100 నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న ఈ మహత్తర కార్యక్రమానికి సంఘీభావం తెలుపుతూ రేణిగుంట పోలీసులు యాత్రికులకు ఘన స్వాగతం పలికారు. డ్రగ్స్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ మిషన్‌కు మద్దతుగా తిరుపతి నుంచి విశాఖపట్నం వరకు సుమారు 1000 కిలోమీటర్ల మేర నిర్వహిస్తున్న ఈ సైకిల్ యాత్రలో పాల్గొన్న యాత్రికులు తిరుచానూరు రైల్వే స్టేషన్ వద్దకు చేరుకోగా, రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ జయచంద్ర, ఎస్సైలు నాగరాజు, సుధాకర్, పోలీసు సిబ్బంది, విద్యార్థులు వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించగా, అనంతరం యాత్రికులతో కలిసి కొంత దూరం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ, మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజల సహకారం అత్యవసరమని పేర్కొన్నారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా సమాజం మొత్తం బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. అవగాహన కార్యక్రమాల ద్వారా మాత్రమే ఈ సమస్యకు సమర్థవంతమైన పరిష్కారం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సీఐ జయచంద్ర మాట్లాడుతూ, యువతే సమాజ మార్పుకు మార్గదర్శకులని, వారు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకొని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు, యువత, సామాజిక సంస్థలు చురుకుగా ముందుకు వచ్చి మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుడు మహాత్మా గాంధీ చేపట్టిన దండి యాత్ర స్ఫూర్తితో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడమే లక్ష్యంగా కొనసాగుతోంది. డ్రగ్స్ వద్దు బ్రో -- సైకిల్ ముద్దు బ్రో, డ్రగ్స్‌కు నో చెప్పండి -- జీవితానికి యెస్ చెప్పండి వంటి నినాదాలతో యాత్ర ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, విద్యార్థులు, యువత, సామాజిక కార్యకర్తలు పాల్గొని మత్తు పదార్థాల నిర్మూలనకు తమ వంతు సహకారం అందించారు.